క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



ఆస్పత్రి ఓపీ విభాగం వద్ద రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులతో సోమవారం ఆస్పత్రి ఆవరణం కిక్కిరిసింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావుతో పాటు స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్యసేవలందించారు. రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కొంతమందిని ఇన్‌పేషంట్లుగా ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్ తయారు చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న ఫ్యామిలీ డాక్టర్, టీబీ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్

పార్వతీపురంటౌన్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్ తయారు చేయాలని ఫ్యామిలీ డాక్టర్, టీబీ ప్రోగ్రాం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాధరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముందస్తుగా ఏ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు, మండలాల వారిగా టీమ్‌లు, ప్రోగ్రాం జరిగే వేదికలు, జరిగే తేదీలు, షెడ్యూల్ ప్రకారం వేస్తున్న స్పెషలిస్టు వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించి చర్చించారు. అనంతరం డీఎంహెచ్ఓతో కలిసి లక్ష్మీనారాయణపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని తనిఖీ చేశారు.

కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.టి.జగన్మోహన్ రావు, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి వినోద్ కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి శ్యామ్ కుమార్, వైద్యాధికారిణి ధరణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు వ్యాక్సిన్



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పశువుల ఆరోగ్య రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సీతానగరం పశువైద్యశాఖ సబ్ డివిజన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం మండలాల్లోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలవద్ద, రూరల్ పశువైద్య కేంద్రాలలో పశువులకు అంటు వ్యాధులవారణకు వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రెండు మండలాల పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్ రామారావు, డాక్టర్ జి.గణేష్‌ల ఆధ్వర్యంలో గ్రామాల్లో లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు 29,600 పశువులకు వేయాలని నిర్ధారించగా ఇప్పటి వరకూ 26,178 పశువులకు టీకాలు వేశారని తెలిపారు. అలాగే 3,420 ఆడ దూడల(4 నెలల నుంచి 8 నెలల వయస్సులోపు)కు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని నిర్ధారించగా ఇప్పటివరకు 1917 దూడలకు వేశామని తెలిపారు. పశువులకు అత్యవసర వైద్య సేవలందించడానికి, ఆస్పత్రుల్లో మందుల సరఫరాపై ప్రస్తావించగా రెండు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలు, డిస్పెన్సరీల్లో మందుల కొరతలేదని తెలియజేశారు.

పొలం గట్లపై కంది సాగు

సీతానగరం: ఖరీఫ్ వరి ఉభాలు పూర్తి కావడం, చేను ఏపుగా పెరగడంతో పొలం గట్లపై మండలంలోని రైతులు అధికాదాయం కోసం వ్యవసాయ శాఖ సమకూర్చిన కందివిత్తనాలను వేశారని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బుడ్డిపేట, పెద భోగిలి గ్రామాల్లో పొలం గట్లపై రైతులు వేసిన కంది మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిచేను పంట కోతకు వచ్చే 15 రోజులకే కందిపంట కోతకు వస్తుందని, ప్రత్యేకించి ఎరువు వేయనవసరం లేదని చెప్పారు. పంటకు వేసే ఎరువు గట్లపై పడడం వల్ల కందిపంటక ఉపయోగపడి ఏపుగా పెరుగుతుందన్నారు. కంది విత్తనాలు గట్లపై వేయాలని, విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

గోగుసాగులో యాజమాన్య పద్ధతులు

- పంటకోత, ఊరవేతే దిగుబడికి కీలకం
- నార నాణ్యతను బట్టే గిట్టుబాటు ధర



పెద్దూరులో సాగులోవున్న గోగుపంట

గరుగుబిల్లి: గోగుపంట ఊరవేతలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన నార ఉత్పత్తి కావడంతో పాటు మంచి ధరను పొందేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. గోగుసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. గోగునారు రెండు దశలలో ఉత్పత్తి అవుతుందన్నారు. పంట ప్రారంభం నుంచి కోతకు వచ్చేవరకు ఒకదశ, కోత కోసిన తర్వాత ఇంటికి వచ్చేవరకు రెండోదశగా పేర్కొనవచ్చు. ఇందులో రెండోదశ అత్యంత కీలకమైందన్నారు. దిగుబడి ఎంతవచ్చినా నాణ్యత లేకపోతే గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా రెండో దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

- విత్తనాలు వేసిన 130 రోజులకు పంట కోతకు వస్తుంది. పంటలో 50 శాతం వరకు పూతకు వచ్చినప్పుడు గోగుపంటను తీస్తే దిగుబడి వస్తుంది.
- గోగుపంటను మొదళ్లతో తీయడం వల్ల నార నాణ్యత తగ్గుతుంది. మొదళ్లను భూమికి సమానంగా కోయాలి.
- గోగు కర్రలు ఊరవేసే ముందు నీటిలో నిలువుగా మొదళ్లు తడిసేలా ఉంచాలి. తరువాత అడ్డంగా చెరువుల్లో, వాగుల్లో ఊరవేయాలి.
- చెరువులో ఊరవేసేటప్పుడు మట్టిదిబ్బలు కాకుండా రాళ్లు కానీ, సిమెంట్ దిమ్మలు కానీ వేసుకోవాలి.
- ఊరవేతకుముందు యూరియా ద్రావణాన్ని గోగుకర్రలు తడిసేలా పిచికారీచేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుంది.
- నీటి స్వచ్ఛత, ఉదజని(పీహెచ్) సూచిక, వాతావరణ పరిస్థితులను బట్టి రెండు వారాల్లోగా ఊరుతుంది.
- కర్రల నుంచి వేరుచేసిన నారను స్వచ్ఛమైన నీటిలో శుభ్రపరచాలి. ఉతికిన నారను ఎండలో ఆరబెట్టాలి. లేదంటే రంగుమారిపోయి నాణ్యత తగ్గిపోతుంది.

సెక్షన్-30 అమలు



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: ఏసీబీ కోర్టు తీర్పుమేరకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆదేశాల మేరకు ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఈనెల 30 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు పరుస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రాజకీయ పార్టీలు గానీ, వివిధ సంఘాలు గానీ పబ్లిక్ ప్రాంగణాల్లో సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదని, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

గిరిజన స్పందనకు 24 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం గిరిజన స్పందన నిర్వహించారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అర్జీలు స్వీకరించారు. మొత్తం 24న వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కుడ్డపల్లికి చెందిన సవర తుంపమ్మ వ్యవసాయబోరు మంజూరు చేయాలని, సారవకోటకు చెందిన జగన్నాథరావు సామాజిక భవనం నిర్మాణ బిల్లు చెల్లించాలని, సీదిగూడకు చెందిన లక్కమ్మ వైఎస్సార్‌బీమా పథకం వర్తింపచేయాలని అధికారులను కోరారు. అలాగే భాషా వలంటీర్‌గా నియమించాలని జంబాడ గ్రామస్తుడు శివకుమార్, చింతాడకు చెందిన సవర సంతు పవర్‌వీడర్ ఇప్పించాలని, తురాయి మానుగూడ గ్రామస్తులు కౌసల్య ఆశావర్కర్ పోస్టు మంజూరు చేయాలని వినతులు అందజేశారు. కమ్యూనిటీహాల్ నిర్మించాలని గూనభద్ర గ్రామస్తుడు వెంకటరావు, తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని డోకులగూడ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, పీఏఓ హరికృష్ణ, డీడీ శ్రీనివాస్, జీసీసీ డీఎం సంధ్యారాణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయ నిధి



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం/భామిని: ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామిని మండలం నులకజోడు గ్రామానికి చెందిన గోరుశెట్టి గణేష్ ఈ ఏడాది ఏప్రిల్ 2న ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పెద్దదిక్కు కోల్పోయిన ఆ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కోరారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు ప్రభుత్వం లక్ష రూపాయలను మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కళావతి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నులకజోడు సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, సాసుబల్లి విశ్వనాథం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, కోట రామారావు, సాసుబల్లి ఫాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం జీజీఎంపీ(గడగడపకు మన ప్రభుత్వం) నిధులతో మంజూరు చేసిన సామాజిక పరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, చేస్తున్న పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని పీఆర్ సబ్ డివిజన్ డీఈ ఎం రత్నకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండలంలోని అంటిపేట, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఏఈ చంద్రమౌళితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీజీఎంపీ నిధులతో అంటిపేట, వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం, కొత్తవలస గ్రామాల్లో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రారంభించిన పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి కొత్త పనులను ప్రారంభించడానికి సిద్ధం కావాలని కోరారు.

డీవీఈఓ మంజులా వీణకు అభినందనలు



అమర వీరుల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎఫ్ఓ ప్రసూన

పార్వతీపురంటౌన్: విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ మంజులావీణను బలిజిపేట కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సిబ్బంది పార్వతీపురం డీవీఈఓ కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఉత్తమ అధ్యాపకురాలిగా రాష్ట్రస్థాయి ఆమె అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీతంనాయుడు, గోపీకృష్ణ, వాసు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

24న పద్యపఠన పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన నియోజకవర్గ స్థాయి పద్యపఠన పోటీలు నిర్వహించనున్నామని వికాస తరంగిణి కేంద్ర సమన్వయకర్త టి.టి.వి.రమణమూర్తి తెలిపారు. సోమవారం ఈ పోటీలకు సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించి, ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా కరపత్రంలో ముద్రించిన పద్యాలు మాత్రమే సాధన చేసి, ప్రదర్శించాలన్నారు. 4, 5 తరగతుల విద్యార్థులు కోరిన పద్యాన్ని చెప్పాలని, 6, 7 తరగతుల విద్యార్థులు కోరిన పద్యంతో పాటు దాని భావం కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఎమ్మార్సీ సిబ్బంది

వీరఘట్టం: మండలం నుంచి రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సాకేటి రాంబాబు, వన్నలి దేవరాజు, వారాడ రాంబాబును స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు, వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు మరింతగా కృషిచేయాలని ఎంఈఓలు జి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



బాలేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న రొక్కం రామారావు, చలపతిరావు

భామిని: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మండలంలో మొదటి విడతలో కొత్తగా 93 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. బాలేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం రామారావు, మేడిబోయిన చలపతి సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. సచివాలయం పరిధిలో కొత్తగా 9 మందికి పింఛన్లు మంజూరైనట్లు కార్యదర్శి కె.సత్యవతి తెలిపారు. అలాగే బత్తిలి, భామినిలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా సౌకర్యం



గురండిలో గృహసారథుల నమోదును పరిశీలిస్తున్న జేసీఎస్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్

భామిని: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు వైఎస్సార్ బీమా నమోదు వేగవంతం చేయాలని జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. భామిని, గురండి, కాట్రగడ-బి, బత్తిలిలో గృహసారథుల బీమా నమోదును సోమవారం పరిశీలించారు. సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో బీమా నమోదు చేయించారు. ప్రతీ సచివాలయ కన్వీనర్ లాగిన్‌లో గృహసారథుల పేర్లు చేర్పించాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు తోట లాల్, శివ్వాల తిరుపతి, కిల్లారి చంటి, పిరపక శ్రీను పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ గ్రామానికి చెందిన ముడిల రజనీకుమారికి చెందిన పుస్తెల తాడు చోరీకి గురైనట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ సోమవారం తెలిపారు. రజనీకుమారి తన తండ్రి వెంకటరమణ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మెడలోవున్న సుమారు మూడున్నర తులాల పుస్తెల తాడును సుమారు రాత్రి మూడు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ పోటీలు



పోటాపోటీగా కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఇందులో పాల్గొని కోకో, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీల్లో తమ సత్తా చాటారు. ఇందులో ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జి.బాబూరావు, పీఈటీ శివరామప్రసాద్ పోటీలను నిర్వహించారు.

దేరుగండకు రహదారి సౌకర్యం



రహదారి వేసేందుకు వీలుగా తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ దేరుగండ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఎస్.అప్పారావు తెలిపారు. డిపార్ట్‌మెంట్ ప్రొసీజర్ పూర్తయిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లమని, ఇప్పుడు రోడ్డు వస్తుందని తెలియడంతో తమ సమస్యకు పరిష్కారం దొరికిందని దేరుగండ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామస్తులంతా చందాలు వేసుకుని కొంత మొత్తాన్ని సేకరించి ఆ డబ్బులతో ఎగువ తాడికొండ నుంచి దేరుగంగ వరకు రోడ్డు వేసేందుకు అనువైన మార్గాన్ని సోమవారం జేసీబీ సాయంతో బాగుచేయించారు.

టీడీపీ బంద్‌కు స్పందన కరువు



కురుపాంలో తెరచుకున్న దుకాణాలు

కురుపాం:

టీడీపీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆ పార్టీ సోమవారం బంద్‌కు పిలుపునివ్వగా.. కురుపాం నియోజకవర్గంలో బంద్‌కు స్పందన కరువైంది. వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా సాగాయి. పార్వతీపురం నుంచి ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు యథావిధిగా జరిగాయి. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వీరఘట్టం: స్కిల్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నేతలు బంద్‌కు పిలుపునిచ్చినా ప్రజల నుంచి ఆశించిన మద్దతు రాలేదు. వ్యాపారులు దుకాణాలు తెరిచి తమ దైనందిత కార్యకలాపాలు యథావిధిగా సాగించారు. స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ తన అనుచరులతో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఇంతలో పోలీసులు రావడంతో వెంటనే అందరూ వెళ్లిపోయారు.

నేడు 6,7 వార్డుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని 6,7 వార్డుల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాను చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాడని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు కక్ష పూరిత చర్యగా టీడీపీ నాయకులు ఆరోపించడం చాలా దౌర్భాగ్యమన్నారు. స్కిల్ స్కామ్‌లో పక్కా ఆధారాలు లభించడంతో పాటు ఆయన సీఎంగా ఉన్నప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతోనే ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిందన్నారు. తప్పు చేసి తప్పించుకోవచ్చులే అనుకునేవారికి ఏదో ఒకరోజు శిక్ష తప్పదన్నారు. ఇన్నాళ్లకు చంద్రబాబునాయుడు చేసిన స్కామ్‌లు బయటపడటంతో చట్టం తన పని చేస్తోందన్నారు.

● భారీ వర్షం



కొత్తవీధిలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పాలకొండ రూరల్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి నీరు చేరింది. కస్పావీధి, కొత్తవీధి, రెల్లివీధుల్లో నీరు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరి, ఇతర పంటలకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. అయితే లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో నీరుచేరి పంట నీటమునగడంతో రైతులు సస్యరక్షణపై దృష్టి పెడుతున్నారు.

అటవీశాఖ అమరవీరులకు ఘనంగా నివాళి

పార్వతీపురం టౌన్: అటవీ సంపదను రక్షించే ప్రయత్నంలో అమరులైన ఆ శాఖ అధికారుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా అటవీశాఖాధికారిణి స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ సంపద, వన్యప్రాణి సంరక్షణలో ఉద్యోగులు వృత్తిని దైవంగా భావించి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం రేంజ్ అధికారి త్రినాథ, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీవీఈఓ మంజులా వీణను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది